క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



భూమి కొలతలు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఈజీఎస్ క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఈజీఎస్ కింద చేపడుతున్న అభివృద్ధి, నర్సరీ పనులను సందర్శించి పనుల వివరాలను ప్రత్యేక్షంగా పర్యవేక్షించారు. భూమి కొలతలు, పనుల నాణ్యతను పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ప్రతిభ, సరిత, ఈజీఎస్ ఈసీ శ్రీనివాసరెడ్డి, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

ఘనంగా గంగా హారతి



జైపూర్: మండలంలోని వేలాలలోని మల్లన్న స్వామి సమీపంలోని గోదావరి నదికి సోమవారం ఘనంగా హారతి అందించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఆలయం సమీపం నుంచి గోదావరి వరకు వెళ్లి భక్తి శ్రద్ధలతో గంగా హారతి సమర్పించారు. గోదావరి మహాహారతి మండల కన్వీనర్, ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోనమెత్తిన నీల్వాయి

వేమనపల్లి: నీల్వాయిలో భీమన్న దేవర బోనాలు సోమవారం వైభవపేతంగా ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ సంతోష్‌కుమార్, ఎస్సై సుబ్బరావు, సర్పంచ్ గాలి మధు పూజలు చేసి కూడలి వద్ద హైమాస్ట్ లైట్లను జాతరతో పాటు ప్రారంభించారు. డప్పుచప్పుళ్లు, డోలువాయిద్యాలు, శివసత్తు ల పూనకాలతో సందడి నెలకొంది. మహిళలు మంగళహారతులతో బోనమెత్తి భీమన్న దేవుడికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



జామ తోటను పరిశీలిస్తున్న హెచ్ఈవో

చెన్నూర్: పండ్ల తోటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఈవో మహేందర్ తెలిపారు. పట్టణంలోని మామిడి, జామ తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటలకు 50శాతం మొక్కల పంపిణీతో పాటు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం అందిస్తుందన్నారు. చామింగ్ తుఫాన్ ప్రభావంతో పండ్ల తోటలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, దూలం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

భీమిని: కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామపంచాయతీలో సోమవారం నడిపెల్లి వెంకట్రావ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 40మందికి అద్దాలు, చుక్కల మందు, 16మందికి త్వరలో బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేయిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన బొమ్మెన చంద్రమౌళి కుమారుడు అజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడికి ఆపరేషన్ నిమిత్తం రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్న చంద్రమౌళికి, కుమారుడి వైద్యఖర్చులు భరించేందుకు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ సమయంలో అతడితో దండేపల్లి ఉన్నత పాఠశాలలో 1996–97వరకు పదోతరగతి చదివిన బాల్య మిత్రులందరూ అండగా నిలిచి మిత్రులంతా కలిసి రూ.43,300నగదును సోమవారం మిత్రుడి కుమారుడి వైద్య ఖర్చులకు అందజేశారు. బాల్య మిత్రులు పాల్గొన్నారు.

బస్సు రాదు.. గోస తీరదు

- మందమర్రి మార్కెట్‌కు బస్సుల రాకపోకలు బంద్
- 30 ఏళ్లుగా స్థానికులకు తప్పని నిరీక్షణ
- మార్కెట్ బస్టాండ్ ప్రాంతంలో అదనపు ఆదాయంపై ఆర్టీసీ దృష్టి
- పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు



మార్కెట్‌లోని ఆర్టీసీ బస్టాండ్

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలో ఉన్న మందమర్రి మార్కెట్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌కు అన్ని బస్సులు రాకపోకలు సాగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. సుమారు ముప్పై సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీ హయాంలో రెండు ఎకరాల స్థలాన్ని సింగరేణి వద్ద తీసుకుని అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బోడ జనార్దన్ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. కొద్దిరోజులు మాత్రమే ఈ బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఈ బస్టాండ్ జాతీయ రహదారికి సుమారు మూడు కిలో మీటర్ల దూరం ఉండడంతో ఆర్టీసీ ఆర్థిక బారంతోనో.. సమయం ఎక్కువవుతుందనో బస్సులు మందమర్రి మార్కెట్ బస్టాండ్‌కు రాకపోకలు బందు చేశారు. దీంతో పాత బస్టాండ్ నుంచి మార్కెట్ రావడానికి ప్రజలకు ఆర్థిక భారం పడుతోంది. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా, ప్రజలు ఎన్ని ఆందోళనా కార్యక్రమాలు చేసినా ఇప్పటి వరకు మార్కెట్ బస్టాండ్‌లోకి బస్సులు మాత్రం రావడం లేదు.

బస్టాండ్‌కు మరమ్మతులు...

మందమర్రి మార్కెట్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌కు కొద్ది రోజుల నుంచి మరమ్మతు పనులు చేపడుతున్నారు. మరుగుదొడ్డి మరమ్మతు, సున్నాలు, రంగులు వేయించడంతో పాటు బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారులు ఎలాంటి చెత్తాచెదారం వేయకుండా వెనుక వైపు ఉన్నటువంటి దారిని మూసివేస్తూ అడ్డంగా గోడ నిర్మిస్తున్నారు. పరిసరాలను శుభ్రపరుస్తున్నారు. మరో రెండు నెలల్లో సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు నూతన హంగులు దిద్దుతున్నారు.



దారి మూసివేతకు గోడ కడుతున్న దృశ్యం

బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ బంక్...

మార్కెట్‌లోని బస్టాండ్ ఆవరణలో అదనపు ఆదాయంపై ఆర్టీసీ దృష్టి సారించింది. సువిశాలమైన ఐదెకరాల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అన్ని సౌకర్యాలతో పాటు ప్రజలకు అందుబాటులో బంకు ఏర్పాటు చేసినట్లైతే దాని ద్వారా ఆదాయం పొందవచ్చనే ఆలోచనతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బీపీసీఎల్(భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థ ముందుకొచ్చి మార్కెట్ సైట్ చూసివెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై డీఎం రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా.. మార్కెట్ బస్టాండ్‌లోకి కొత్తగా బస్సులు ఏమీ రావని, బీపీసీఎల్ వారు పెట్రోల్ బంక్ అనుమతుల కోసం బస్టాండ్ పరిసరాలు చూసి వెళ్లారని తెలిపారు.

> **బస్సులు వచ్చేలా చూడాలి..**
>
> 
>
> లక్షల వ్యయంతో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం నిర్మించిన మార్కెట్ బస్టాండ్ లోకి అన్ని బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. పాత బస్టాండ్ వరకే బస్సులు రావడంతో మార్కెట్ వైపు ప్రజలకు ఆర్థిక భారం తప్పడం లేదు. రాత్రి సమయంలో ఆటోలు కూడా ఉండకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ ప్రజల ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని మార్కెట్ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చూడాలి.
>
> – బైరి సుదర్శన్, వాచ్ రిపేర్ వ్యాపారి, మందమర్రి మార్కెట్

ఆటోడ్రైవర్ల నిరసన ర్యాలీ

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం రద్దు చేయాలని లేదా ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జన్నారం మండలకేంద్రంలో ఆటోలతో డ్రైవర్లు, టాటాఏసీ, జీపు ఓనర్స్, డ్రైవర్లు నిరసన ర్యాలీ చేశారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీసి, తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ.. నిత్యం ఆటో నడుపుకొని కుటుంబాలను పోషించుకుంటున్న మాకు, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో గిరాకీలు తగ్గాయన్నారు. రోజువారీగా డీజిల్ చార్జీలు కూడా రావడం లేదన్నారు. ఇలాగే ఉంటే మా కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేదా ఈ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నసీరోద్దీన్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, కోశాధికారి మొగిలి, ఉపాధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఉపాధి దెబ్బతింటోందని ఆరోపిస్తూ సోమవారం బెల్లంపల్లిలో ఆటో డ్రైవర్లు నిరసన చేశారు. కాంటా చౌరస్తా వద్ద బెల్లంపల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు సామూహికంగా తరలివచ్చి నిరసన తెలిపి నినాదాలు చేశారు. ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు రామ్‌కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గెలిపించిన మీ రుణం తీర్చుకుంటా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: ఎన్నికల్లో నాపై నమ్మకంతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలను అందరికీ అందేలా చూస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జు మొదటిసారి జన్నారం రావడంతో ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా డప్పు వాయిద్యాలతో, నృత్యాలతో కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నా గెలుపు కోసం కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టాలలో తోడుగా ఉంటానని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని తెలిపారు. జన్నారం మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమస్యలపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, సీనియర్ నాయకులు రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, శంకరయ్య, ఎంపీటీసీ రియాజోద్దీన్, సయ్యద్ ఇసాక్, నందునాయక్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న బొజ్జు

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించండి

తాండూర్: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు విషయంలో జరిగిన ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని వార్డు సభ్యుడు తిరుపతి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అనంతరం నిర్వహించిన ప్రజావాణిలో ఒక ఫిర్యాదు అందినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ గ్రామ పంచాయతీలో ఎక్కడెక్కడ కరెంటు స్తంభాలు అవసరమో సభ్యులు చర్చించి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి రూ.నాలుగు లక్షల 64వేలు విద్యుత్ అధికారులకు డీడీ చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం కాకుండా వేరే చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజావాణిలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



తాండూర్: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు ఎలాంటి అర్జీలు రాలేదు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేం సాగర్‌రావును యూనియన్ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పర్వతి సత్యనారాయణ, జి ల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్, అసోసియేట్ అధ్యక్షుడు సాంబయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు సహదేవ్, వెంకటేశ్, వివిధ మండలాలకు చెందిన బాధ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రేంసాగర్‌రావును సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో టీఎన్జీవోస్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలతో సత్కరించి, శాలువా కప్పారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రావు, సంయుక్త కార్యదర్శి సునిత, యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యవర్గ సభ్యులు కుమార్, పద్మజ, సంజీవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన 'గూడెం' అధికారులు

దండేపల్లి: ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును గూడెం ఆలయ అధికారులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామివారి శేషవస్త్రంతో ఆయనను సన్మానించారు. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకుడు సంపత్, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ మోహన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు త్రిమూర్తి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు గెలుపొందడంపై 17వ వార్డు కౌన్సిలర్ పూదరి సునిత, పూదరి ప్రభాకర్‌లతో పాటు, కొందరు కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. చున్నంబట్టి వాడలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మొక్కులను సమర్పించుకుని, 108 కొబ్బరి కాయలు కొట్టారు. పీఎస్సార్‌కు మంత్రి పదవి రావాలని మొక్కులు తీర్చుకున్నారు.

ఐఎన్టీయూసీలో పలువురి చేరిక

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీకి చెందిన పలువురు కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు సోమవారం ఐఎన్టీయూసీలో చేరారు. యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు రాజమొగిలి, కాంపెల్లి సమ్మయ్య కండువా కప్పి ఆహ్వానించారు. ఐఎన్టీయూసీ ద్వారానే కార్మికు ల సమస్యలు పరిష్కారమవుతాయని రాబోయే గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి సెనిగారపు రాములు, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, పల్లెరాజు, మహంకాళి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

సింగరేణి గోడలపై యూనియన్ రాతలు

మందమర్రిరూరల్: ఈ నెల 27న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించడానికి యాజమాన్యం సన్నద్ధమైంది. పలు కార్మిక సంఘాలు కూడా ఎన్నికల్లో గెలవడానికి ఆయా గనులపై సమావేశాలు నిర్వహిస్తూ ఇప్పటివరకూ ఆ యూనియన్ సాధించిన హక్కులతో పాటు ఇతర యూనియన్లు చేసిన ద్రోహాలను వివరిస్తూ కార్మికులకు పలు హామీలు ఇస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఏఐటీయూసీ సంఘం మాత్రం ఒకడుగు ముందుకు వేసి గనులపై ఉన్న సింగరేణి ఆస్తుల గోడలపై రాస్తూ అభ్యర్థిస్తున్నారు. సింగరేణి ఆస్తుల, గోడలపై ఎలాంటి రాతలు రాయకూడదు అనే నిబంధనలు ఉన్నా, కేకే–5 గని క్యాంటిన్‌పై పలుచోట్ల ఏఐటీయూసీకి సంబంధించిన వాల్ రైటింగ్ కనిపించడం కొసమెరుపు. ఆ గని అధికారి ఆ యూనియన్‌కు అనుకూలంగా ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



గోడపై ఏఐటీయూసీ వాల్ రైటింగ్

నేటి నుంచి సింగరేణి క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: సింగరేణి డేను పురస్కరించుకొని మంగళవారం నుంచి పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌కాలనీ సేవా భవన్ వద్ద సాయంత్రం 5గంటలకు, 13న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో బాంబ్‌బ్లాస్ట్, టగ్‌ఆఫ్‌వార్, 50మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నారు. అదే రోజు ప్రగతి మైదానంలో దీపాలంకరణ పోటీలు ఉంటాయి. 14న నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద దీపాలంకరణ పోటీలు, 16న జీఎం కార్యాలయం వద్ద ఉద్యోగులకు టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, త్రోబాల్, సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో బాల్ ఇన్ బాస్కెట్, పాసింగ్ బాల్, బాంబ్ బ్లాస్ట్, దీపాంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

'నమ్మి మోసపోవద్దు'

రామకృష్ణాపూర్: టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ నాయకుల మాటలు నమ్మి కార్మికులు మరోసారి మోసపోవొద్దని కార్మికుల హక్కుల కోసం చిత్తశుద్ధితో పనిచేసే ఏఐటీయూసీకే రాబోయే గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు అండగా నిలువాలని ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ ఓసీలో సోమవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీల హయాంలో కార్మికులకు వేదింపులే మిగిలాయి తప్పా, వారి హయాంలో కార్మికులకు జరిగిన లాభం ఏమి లేదన్నారు. గెలిచినా, ఓడినా ఎల్లప్పుడు కార్మికుల పక్షాన నిలిచేది ఏఐటీయూసీ మాత్రమేననేది కార్మికులు గుర్తుంచుకోవాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

టీబీజీకేఎస్‌కు రాజీనామా

మందమర్రిరూరల్: ఏరియాలోని పలువురు బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్ నాయకులు సోమవారం సభ్యత్వానికి రాజీనామాలు చేసినట్లు తెలిపారు. వారి రాజీనామా పత్రాలను ఆ యూనియన్ అధ్యక్షుడు వెంకట్రావ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే యూనియన్ సభ్యత్వానికి రాజీనామాలు చేస్తున్నట్లు, ఇన్ని రోజులుగా తమకు సహకరించిన నాయకులకు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో ఏరియా జీఎం స్థాయి చర్చల ప్రతినిధులు సీవీ రమణారావు, దుగ్గిరాల శంకర్‌రావు, ఏరియా స్థాయి మైనింగ్ షిఫ్ట్ ఇన్‌చార్జి పెంద్రి రాజిరెడ్డి ఉన్నారు.

డెప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజీనామా

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్‌కు ఆ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ చాట్ల అశోక్ రాజీనామా చేశారు. సోమవారం ఆ యూనియన్ అధ్యక్షుడు వెంకట్రావుకు రాజీనామ లేఖను మెయిల్ ద్వారా పంపించారు. వ్యక్తిగత కారణాలతో తన యూనియన్‌లోని పదవికి, సభ్యత్వానికి రాజీనామా సమర్పించినట్లు లేఖలో పేర్కొన్నారు.

ట్రస్ట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: న్యూ అభయ చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీని శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో సోమవారం ఎన్నుకున్నారు. సీఎండీగా ఎం.వినయ్ ప్రశాంత్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా కుంబాల శ్రావణి, జనరల్ సెక్రెటరీగా వై.జీవన సందీప్‌కుమార్, ట్రెజరర్‌గా ఎం.రమేశ్, జాయింట్ సెక్రెటరీలుగా కే. సువర్ణ, సుష్మ, కే. మెర్సిజాయ్, వేముల సుదమల, పరిమళ, లావణ్య, సభ్యులుగా బీ.పద్మజను ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

జన్నారం: సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 'మానవ విలువలు–నేటి సమాజంలో పాత్ర' అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సుర్షిత జిల్లాస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు హెచ్ఎం కట్ట రాజమౌళి తెలిపారు. మండల విద్యాధికారి విజయ్‌కుమార్ సోమవారం ఆ విద్యార్థినిని అభినందించారు.

రామాలయంలో మహా రుద్రాభిషేకం

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ శ్రీ కోదండ రామాలయంలో సోమవారం మహా రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో చివరి సోమవారం, మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి బ్రహ్మశ్రీ ముద్దు అవధూత శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

నూతన హెచ్ఎంలకు సన్మానం

కోటపల్లి: ఇటీవల మండలానికి వచ్చిన గెజిటెడ్ హెచ్ఎం(యోగేశ్వర్, కృష్ణమూర్తి, దామోదర్‌రెడ్డి, మొగిలి, మాదవిదేవి, వెంకటేశ్వర్లు)లను మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, బాపు, నాగేందర్, నరహరి అంజన్‌కుమార్, రవి రమాదేవి, స్వరూప, పర్వీన్, పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోకు విశేష స్పందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. ఈ ఎక్స్‌పోను మదర్ జియో జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా సిస్టర్ మోబిల్, ఉపాధ్యాయుడు సతీశ్ వ్యవహరించి విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు తిలకించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. సైన్స్ ఎక్స్‌పోలో పాఠశాల ఉపాధ్యాయురాలు సిస్టర్ ఆల్ఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుగ్గలో ప్రత్యేక పూజలు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస చివరి సోమవారం, మాస శివరాత్రిని పురస్కరించుకొని రాజేశ్వరునికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

వేమనపల్లి: మండలంలోని సూరారం, బుయ్యారం గ్రామపంచాయతీల్లో ఉచిత గర్భకోశ చికిత్స, అవగాహన శిబిరాన్ని పశువైద్యాధికారి చందన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 19మంది రైతులకు చెందిన 26గేదెలు, పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 11దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగర్ల శ్రీనివాస్, ఓఎస్ ఫిరోజ్, గోపాలమిత్ర జిల్లా సూపర్‌వైజర్ రవి, గోపాలమిత్రలు శ్రీకాంత్, సురేష్ ఉన్నారు.

అయ్యప్ప పడిపూజ

తాండూర్: తాండూర్ ఐబీ మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామికి ఘనంగా పడిపూజోత్సవ కార్యక్రమం జరిగింది. రెబ్బెనకు చెందిన సూర్య భాస్కరశర్మ, కిరణ్ శర్మ గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడి పూజోత్సవానికి అయ్యప్ప మాలదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మారు మోగింది. అమ్మవారితో పాటు విఘ్నేశ్వర సుబ్రహ్మణ్య అయ్యప్ప స్వాములకు అష్టోత్తర సహస్ర నామ పూజా కార్యక్రమాలతో పాటు అభిషేక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

జన్నారం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కారణాల వల్ల మృత్యువాత పడ్డ గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలోని కవ్వాల్ గ్రామం నుంచి ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన అంబటి అనంతయ్య కుటుంబానికి సోమవారం కవ్వాల్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.